

టమాట కిలో రూ.20
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.10 పలికింది. మార్కెట్‌కు 480 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



చీనీ టన్ను రూ.34 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి. మార్కెట్‌కు 223 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
36.1°/12.3°
జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు మళ్లీ తగ్గడంతో ఉదయం అక్కడక్కడా చలి వాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9వ తరగతిలో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా నుంచి 714 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా లేపాక్షి విద్యాలయ పరీక్ష కేంద్రంలో 358 మంది పరీక్ష రాసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు వెల్లడించారు.

గంజాయి సాగు కేసులో టీడీపీ నేతకు రిమాండ్



గుండే వీరంనాయుడు

గాండ్లపెంట: గంజాయి సాగు కేసులో టీడీపీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండే వీరం నాయుడును పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసు వివరాలను కదిరి రూరల్ స్టేషన్‌లో సీఐ శంకర్‌నాయక్ విలేకరులకు తెలిపారు. గొడ్డువెలగల పంచాయతి గుండేవాండ్లపల్లిలో గంజాయి సాగు చేస్తున్న విషయం తెలియడంతో ఈ నెల 6వ తేదీన పోలీసులు గ్రామానికి వెళ్లారు. వీరంనాయుడుకు చెందిన పొలంలో (సర్వేనంబరు 245) సాగులో ఉన్న గంజాయి మొక్కలు గుర్తించి తొలగించారు. అదే రోజు పొలాన్ని లీజుకు తీసుకుని వేరుశనగ పంటతో పాటు గంజాయి సాగు చేసిన రామకృష్ణను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న వీరంనాయుడు కటారుపల్లి విశ్వవేమనకొండ వద్ద ఉన్నట్లు తెలిసి ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో కలిసి వెళ్లి శనివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జడ్జి ఆదేశాల మేరకు రిమాండుకు పంపినట్లు సీఐ వెల్లడించారు.

రూ.2. 65 లక్షల మందులు సీజ్



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ శ్రీహరినాయక్

తనకల్లు: నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ హెచ్చరించా. శనివారం ఆయన కొక్కంటిక్రాస్‌లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వెంకటేశ్వర్ ఫర్టిలైజర్స్‌లో రూ.1,60,073 విలువైన మందులు, చిన్నపరెడ్డి ఫర్టిలైజర్స్‌లో 1,05,525 విలువ చేసే పురుగుల మందులకు పత్రాలు చూపకపోవడంతో స్టాప్ సేల్ ఆర్డర్ ఇచ్చి సీజ్ చేశారు. 21 రోజుల్లోపు తగిన పత్రాలను స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రకృతి ధామం పరివర్తన క్షేత్రం

SUNDAY SPECIAL



ఖైదీలు సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయల పంటలు

అక్కడికి అడుగుపెట్టగానే పచ్చనిచెట్లు స్వాగతం పలుకుతాయి. ప్రకృతి రమణీయత ఆహ్లాదాన్ని పంచుతుంది. పాడిపంటలు కనువిందు చేస్తాయి. జీవవైవిధ్యం ముచ్చటగొలుపుతుంది. ఒకసారి ప్రవేశిస్తే ఎంతసేపైనా అక్కడే ఉండిపోవాలనిపిస్తుంది. అలాగని అదేమీ అందమైన అటవీ ప్రాంతం కాదు. జనారణ్యం నడుమ ఉన్న ఓ జైలు. వినడానికి వింతగా ఉన్నా.. ఇది ముమ్మాటికీ నిజం. అదే రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్ జైలు (ఖైదీల వ్యవసాయ క్షేత్రం). ఖైదీల పరివర్తన కేంద్రంగా, అందమైన వ్యవసాయ క్షేత్రంగా రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది.



ఓపెన్ ఎయిర్ జైలులోని మిరప తోటలో పనిచేస్తున్న ఖైదీలు

- ప్రత్యేకతను చాటుకుంటున్న రెడ్డిపల్లి ఓపెన్‌ఎయిర్ జైలు
- పాడిపంటలు, ప్రకృతి రమణీయతకు నిలయం
- జీవవైవిధ్యానికీ ఆలవాలం
- ఖైదీల సమగ్ర పరివర్తనకు దోహదం



కూరగాయలు విక్రయిస్తున్న ఖైదీ

అనంతపురం డెస్క్:
క్షణికావేశంలో చేసిన నేరాలు జైలుగోడల మధ్యకు నెడతాయి. సుదీర్ఘకాలం అక్కడే ఉండిపోవాల్సి వస్తే జీవితమే నరకంగా మారుతుంది. తప్పు చేస్తే శిక్ష అనుభవించాలి కానీ అది పరివర్తనకు దోహదపడినప్పుడే అర్థవంతమవుతుంది. ఖైదీల్లో పరివర్తన, చట్టాలను గౌరవించే పౌరులుగా తీర్చిదిద్దడం, పునరావాసానికి దోహదపడాలనే ఉద్దేశంతో ఓపెన్ ఎయిర్‌జైలు వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి వద్ద ఓపెన్ ఎయిర్ జైలును 1965 సంవత్సరంలో అప్పటి కేంద్రమంత్రి నీలం సంజీవరెడ్డి ప్రారంభించారు. అనంతపురం నగరానికి అత్యంత చేరువలో ఉండే ఈ జైలును మొదట్లో 1,427.57 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. తర్వాత క్రమంలో జిల్లా జైలు, ఏపీఎస్‌పీ బెటాలియన్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీకి 623.44 ఎకరాలను కేటాయించారు. దీంతో ప్రస్తుతం 804.13 ఎకరాల్లో ఓపెన్ ఎయిర్‌జైలు కొనసాగుతోంది.

స్వేచ్ఛా జీవితం.. నైపుణ్య శిక్షణ..

సాధారణ జైల్లో శిక్ష అనుభవించే సమయంలో క్రమశిక్షణతో మెలిగి, పరివర్తన చెందేవారిని చివరిదశలో రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్‌జైలుకు పంపుతారు. ఇక్కడి స్వేచ్ఛా వాతావరణంలో ఖైదీల్లో ఒత్తిడి తగ్గించి.. వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు సమగ్ర వికాసానికి దోహదం చేస్తున్నారు. వారు విడుదలైన తర్వాత సమాజంలో సాఫీగా బతకడానికి అవసరమైన నైపుణ్యాలు పెంపొందిస్తున్నారు. వాస్తవానికి ఈ జైలును 300 మంది ఖైదీల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. అయితే..జిల్లా జైళ్లలోనే సెమీ ఓపెన్‌ఎయిర్ సిస్టం తేవడం, నేరాల సంఖ్య తగ్గడం, ఇతరత్రా కారణాల వల్ల ప్రస్తుతం ఇక్కడ 32 మంది మాత్రమే ఉన్నారు.

వంటల సాగు.. పెట్రోల్ బంకుల నిర్వహణ..

రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్‌జైలు ఖైదీలు వ్యవసాయ, అనుబంధ విభాగాలతో పాటు పెట్రోల్ బంకుల నిర్వహణలోనూ సత్తా చాటుతున్నారు. దాదాపు అన్నిరకాల కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. వీటిని గతంలో ట్రాక్టరులో అనంతపురానికి తెచ్చి విక్రయించేవారు. ఇప్పుడు జైలు వద్దే అనంతపురం-తాడిపత్రి రహదారి పక్కన అమ్ముతున్నారు. తక్కువ పురుగు మందుల వాడకంతో నాణ్యమైన కూరగాయలు పండిస్తుండడంతో వీటి కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మామిడి, సపోటా, ఉసిరి తదితర పండ్లతోటల సాగుతో పాటు డెయిరీ నిర్వహణ, గొర్రెలు, పశువుల పెంపకంలోనూ ఖైదీలు నైపుణ్యం సాధించారు. ఇక పెట్రోల్ బంకుల నిర్వహణలో విజయవంతంగా ముందుకు సాగుతున్నారు. ఇక్కడ రెండు పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటి ద్వారా రోజూ రూ.పది లక్షల దాకా వ్యాపారం చేస్తున్నారు.

ఓపెన్ ఎయిర్ జైలు స్వరూపమిదీ..	
మొత్తం విస్తీర్ణం (ఎకరాలు)	1,427.57
ప్రస్తుత విస్తీర్ణం (ఎకరాలు)	804.13
ఖైదీల సామర్థ్యం	300
ప్రస్తుతమున్న ఖైదీల సంఖ్య	32

ప్రకృతి రమణీయత.. జీవ వైవిధ్యం..

ఓపెన్ ఎయిర్‌జైలు ప్రకృతి రమణీయతకు నిలయంగా ఉంది. ఎటుచూసినా చెట్లు, పండ్ల తోటలు, పంటలతో అలరారుతోంది. వన్యప్రాణులకూ ఆశ్రయమిస్తోంది. పచ్చనిచెట్ల మధ్య నెమళ్లు, కుందేళ్లు, అడవి పందులు, ముంగిసలు తదితర వన్యప్రాణులు సందడి చేస్తున్నాయి. వీటిని ఖైదీలు, జైలు అధికారులు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ఇలా ఎన్నో ప్రత్యేకతలు, వైవిధ్యం కల్గివున్నందునే అది ఒక జైలన్న భావన కల్గదు. అక్కడున్న వారు ఖైదీలన్న విషయమూ మరచిపోతాము.

ఫొటోలు : జి.వీరేష్, సాక్షి ఫొటోగ్రాఫర్

నా పొలమేనన్న భావన కలుగుతోంది



చేసిన తప్పు వల్ల శిక్ష అనుభవిస్తున్నా. ఓపెన్ ఎయిర్ జైలుకు వచ్చిన తర్వాత నాలో మార్పు వచ్చింది. ఇక్కడ కూరగాయలు పండిస్తున్నా. సొంత పొలంలో పనిచేస్తున్నామన్న భావన కలుగుతోంది. ఇక్కడ పనికి రోజుకు రూ.180 చొప్పున ఇస్తారు. ఇందులో సగం అవసరాలకు వాడుకోవచ్చు. మిగిలిన సగం బ్యాంకు ఖాతాలో జమ చేసి..విడుదలైన తర్వాత ఇస్తారు.
– లక్ష్మీనారాయణ

బతికే ధీమా వచ్చింది



తోటి ఖైదీలు పండించే కూరగాయలు, ఆకుకూరలను నేను ఇక్కడ విక్రయిస్తున్నా. నా పని రోజూ ఇదే. ఓపిక, సహనం పెంపొందాయి. ప్రజలతో ప్రవర్తించే తీరులోనూ మార్పు వచ్చింది. ఇక్కడ నేర్చుకున్న ఈ పనితో జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత కూడా ధైర్యంగా బతకొచ్చన్న ధీమా వచ్చింది.
– కృష్ణ

పని బాగా నేర్చుకున్నా..



కడప సెంట్రల్ జైలులో కొంతకాలం శిక్ష అనుభవించిన తర్వాత ఇక్కడికొచ్చా. వాతావరణం చాలా బాగుంది. పెట్రోల్ బంకులో పంపు బాయ్‌గా పనిచేస్తున్నా. ఈ పనిలో నైపుణ్యం సాధించా. జైలు అధికారులు రోజుకు రూ.200 చొప్పున చెల్లిస్తున్నారు.
– అమరనాథ్‌రెడ్డి

పరివర్తన, పునరావాసానికి కృషి



ఖైదీల్లో సమగ్ర పరివర్తనకు కృషి చేస్తున్నాం. వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో నైపుణ్యాలు పెంపొందిస్తున్నాం. ఖైదీలు పంటల సాగు, పెట్రోల్ బంకుల నిర్వహణలో ప్రతిభ చూపుతున్నారు. మా క్షేత్రం నుంచి పెట్రోల్ బంకులు మినహా ఇతరత్రా ఆదాయ మార్గాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.60 లక్షల దాకా జమ చేస్తున్నాం.
–కె.చిన్నారావు, జైలు సూపరింటెండెంట్

మంత్రి ఉషశ్రీచరణ్ కాన్వాయ్‌కి ప్రమాదం

- పెనుకొండ సమీపంలో లారీని ఢీ కొన్న ఎస్కార్టు వాహనం



ప్రమాదంలో దెబ్బతిన్న ఎస్కార్ట్ వాహనం

పెనుకొండ రూరల్: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ కాన్వాయ్‌లోని ఓ వాహనానికి ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మంత్రి ఉషశ్రీ చరణ్ శనివారం అనంతపురం నుంచి బెంగళూరు వైపు వెళ్తున్నారు. ఆమె కాన్వాయ్‌లో ముందు వెళ్తున్న ఎస్కార్ట్ వాహనం పెనుకొండ జాతీయ రహదారిపై పుట్టపర్తి జంక్షన్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందుభాగం పాక్షికంగా దెబ్బతినింది. అయితే ఎవరికీ ఏమీ కాలేదు. దీంతో కాన్వాయ్ ముందుకు సాగిపోయింది. ఈ ఘటనపై 'కియా' ఎస్‌ఐ వెంకటరమణను వివరణ కోరగా, తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

- రోడ్డు మలుపులో బైక్‌ను ఢీ కొన్న టిప్పర్



సంఘటనా స్థలంలోనే మృతి చెందిన శ్రీధర్, అనిల్‌కుమార్

అమరాపురం: రోడ్డు మలుపులో బైక్‌ను టిప్పర్ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన శనివారం సాయంత్రం హేమావతి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా శిర తాలుకా చిక్కహులికుంటకు చెందిన అనిల్‌కుమార్ (25), అమరాపురం మండలం హనుమంతనపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్ (26) శనివారం చిక్కహులికుంట గ్రామం నుంచి అమరాపురం మండలం హనుమంతనపల్లి గ్రామానికి బైక్‌పై బయలు దేరారు. వీరి బైక్ అమరాపురం మండలం కెంపక్కనహట్టి దాటిన తర్వాత మలుపు వద్దకు రాగానే హేమావతి నుంచి వస్తున్న టిప్పర్ ఢీ కొంది. దీంతో బైక్‌పై ఉన్న అనిల్ కుమార్, శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందారు. హేమావతి గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్‌ఐ.వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు.

లోక్ అదాలత్‌లో 1,741 కేసుల పరిష్కారం



పుట్టపర్తి కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని ఆరు కోర్టుల్లో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 1,741 కేసులు పరిష్కారమయ్యాయి. శనివారం కదిరి కోర్టులో అత్యధికంగా 490 కేసులు, అలాగే హిందూపురం కోర్టులో 180 కేసులు, పెనుకొండ కోర్టులో 207, పుట్టపర్తి కోర్టులో 110, ధర్మవరం కోర్టులో 63, మడకశిర కోర్టులో 61 కేసులు కలిపి మొత్తంగా శనివారం ఒక్కరోజే 1,111 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. అలాగే శుక్రవారం నిర్వహించిన లోక్ అదాలత్‌తో ఆరు కోర్టుల్లో మరో 630 కేసులు పరిష్కారయ్యాయి. దీంతో లోక్‌అదాలత్‌తో మొత్తంగా 1,741 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు వర్గాలు వెల్లడించాయి. కదిరి సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, పుట్టపర్తి జడ్జి రాకేష్, హిందూపురం సివిల్ జడ్జి శైలజ, పెనుకొండ జడ్జి శంకరరావు, మడకశిర లోక్ అదాలత్ ఆఫీసర్ శ్రీధర్, ఆయా సర్కిళ్ల సీఐలు, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

చక్కని పరిష్కారం..

రాజీ కాదగిన కేసులకు లోక్ అదాలత్ ద్వారా చక్కని పరిష్కారంతో పాటు సత్వర న్యాయం లభిస్తోందని పలువురు జడ్జీలు తెలిపారు. చిన్న పాటి తగాదాలు, మనస్పర్థలు, మాట పట్టింపులతో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతూ నష్ట పోకూడదని, శాంతియుత వాతావరణంలో కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. పరిష్కారమైన కేసులకు సంబంధించి ఇరువర్గాలనూ లోక్ అదాలత్‌లో విచారించి సమస్య భవిష్యత్తులో పునరావృతం కాకూడదని హెచ్చరికలు జారీ చేసి పంపుతామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలి

- 13వ తేదీ వరకూ ఓటరు నమోదు ప్రక్రియ
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ బసంత్‌కుమార్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: మార్చిలో నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలూ సహకరించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ కోరారు. ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన హాలులో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పశ్చిమ రాయలసీమ పరిధిలోని పట్టభద్రుల, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈనెల 9వ తేదీన షెడ్యూల్ విడుదలైందన్నారు. ఆ రోజు నుంచే 'కోడ్' అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల నియమావళిని ఏ ఒక్కరూ ఉల్లంఘించరాదన్నారు. షెడ్యూలు మేరకు ఈనెల 16వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలవుతుందని, 23వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ, 24వ తేదీ పరిశీలన, 27వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ, మార్చి 13న పోలింగ్(ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ) మార్చి 16న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ మొత్తం మార్చి 21వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉందన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 13వ తేదీ సాయంత్రం వరకూ ఆన్‌లైన్ ద్వారా నూతన ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అనంతరం వాటిని పరిశీలించి ఓటింగ్ నాటికి తుది జాబితాలో చేరుస్తామన్నారు. ఎన్నికల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా ఆయా పార్టీల నేతలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్ల వద్ద అన్ని పార్టీల నేతలు ,కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కొండయ్య, వైఎస్సార్ సీపీ ప్రతినిధి అవుటాల రమణారెడ్డి, బీజేపీ నేత ప్రసాద్, సీపీఎం నేతలు గంగాధర్, వెంకటేషు, సీపీఐ నేత రామాంజనేయులు, టీడీపీ నేత ఆదినారాయణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'జగనన్నే మళ్లీ సీఎం కావాలి'



జెండా ఊపి పాదయాత్ర ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గోవింద రెడ్డి

చెన్నేకొత్తపల్లి: 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సాలెమ్మగారి సాయికృష్ణ మేడాపురం నుంచి తాడేపల్లికి పాదయాత్ర ప్రారంభించారు. శనివారం స్థానిక లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు గోవింద రెడ్డి జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం సాయి కృష్ణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాలను ఆదుకున్నారన్నారు. మళ్లీ ఆయన ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం మరింత అభివృద్ధి బాటలో సాగుతుందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి పాదయాత్ర శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్, నరసింహులు, సన్నాయప్ప, మురళీ నాయక్, బాబ్జి నాయక్, చెన్నారెడ్డి, మందల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రైలు బండి.. వచ్చెనండి..



కే రామపురం రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రైలు

పావగడ: 12 ఏళ్లుగా వేయి కళ్లతో ఎదురు చూస్తున్న రాయదుర్గం–తుమకూరు రైలు బండి ఎట్టకేలకు శనివారం పావగడకు వచ్చేసింది. పావగడ– కళ్యాణదుర్గం మార్గంలోని కే రామపురం గ్రామంలో నిర్మించిన రైల్వేస్టేషన్‌కు ప్యాసింజర్ రైలు కూత వేసు కుంటూ చేరుకుంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ రైల్వే అధికారులు రైలుకు స్వాగతం పలికారు. చుట్టు పక్కల వందలాది మంది గ్రామ ప్రజలు రైలును చూడ్డానికి పరుగున వచ్చారు. ఉత్సాహంతో ఉర్రూతలూగారు. రాంపురం వరకు 80 శాతం పనులు పూర్తయ్యాయి. మడకశిర, మధుగిరి, కొరటగెరె ప్రాంతాల్లో పనులు మందకొడిగా సాగుతుండడంతో స్థానిక రైలు తుమకూరు చేరుకోడానికి మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ఆర్టీసీలో డీజిల్ మాఫియా

- నిబంధనలకు విరుద్ధంగా ఇంధనం కొనుగోలు
- సమీపం నుంచి కాకుండా సుదూర ప్రాంతం నుంచి సరఫరా
- అక్రమాలు గుర్తించి ట్యాంకర్‌ను సీజ్ చేసిన తహసీల్దార్
- వదిలి పెట్టాలంటూ అధికారులకు డీజిల్ వ్యాపారుల బెదిరింపు



సీజ్ చేసిన డీజిల్ ట్యాంకర్ వద్ద తహసీల్దార్ రాము, డీటీలు సుబ్బలక్ష్మి, ఆదినారాయణ



ఆర్టీసీ డీఎంతో వాగ్వాదానికి దిగిన తహసీల్దార్ రాము

గుంతకల్లు టౌన్: ఆర్టీసీలో డీజిల్ మాఫియా వెలుగు చూసింది. సమీపంలో నుంచి సరఫరా చేయాల్సిన ఇంధనాన్ని సుదూర ప్రాంతం నుంచి తీసుకొచ్చి డిపోకు చేరవేస్తున్నారు. మాఫియా నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి ఇంధనం సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. తమకందిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు గుంతకల్లు డిపోకు అక్రమంగా డీజిల్‌ను తీసుకొచ్చిన ట్యాంకర్‌ను శనివారం సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. గుంతకల్లు ఆర్టీసీ డిపోకు డీజిల్‌ను సరఫరా చేసే కాంట్రాక్ట్ గార్లదిన్నెలోని మణికంఠ ఐఓసీ ఔట్‌లెట్ నిర్వాహకులకు వచ్చింది. మార్కెట్‌లో రూ.99.20 ఉన్న డీజిల్‌ను రూ.96.75కే సరఫరా చేస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే కర్ణాటక నుంచి డీజిల్ కొని.. ఆంధ్రాలో వే బిల్లు వేసి.. డిపోకు సరఫరా చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు శనివారం ఏపీ02.టీసీ.7778 నంబరు గల లారీ 12వేల లీటర్ల డీజిల్‌తో గుంతకల్లు డిపోకు వచ్చింది. అదే సమయంలో తహసీల్దార్ బి.రాము, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, రీసర్వే డీటీ ఆదినారాయణ, వీఆర్వోలు కృష్ణ, చిట్టి తదితరులతో కలిసి దాడులు నిర్వహించి పత్రాలు పరిశీలించారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలోని శ్రీషిర్డీసాయి ఫిల్లింగ్ స్టేషన్ నుంచి డీజిల్‌ను తీసుకొచ్చినట్లు వేబిల్లులో ఉంది. అంతేకాదు గార్లదిన్నె ఐఓసీ ఔట్‌లెట్‌కు సంబంధించిన ఖాళీ లెటర్‌హెడ్, ఖాళీ రసీదు లభించాయి. 120 కిలోమీటర్ల రానుపోను దూరం ఉండే గార్లదిన్నెను కాదని 438 కిలోమీటర్ల రానుపోను దూరం ఉన్న ఔట్‌లెట్ నుంచి డీజిల్ ఎలా సరఫరా చేస్తారు? అంటే కర్ణాటకలో తీసుకొచ్చి.. ఆంధ్రాప్రాంతంలో కొన్నట్టు తప్పుడు వేబిల్లులు చూపి.. సొమ్ము చేసుకుంటున్నట్లు ప్రాథమికంగా రెవెన్యూ అధికారులు నిర్ధారించి డీజిల్ ట్యాంకర్‌ను సీజ్ చేశారు.

ఆర్టీసీ డీఎంపై మండిపాటు..

డీజిల్ సరఫరా ఏ ఔట్‌లెట్‌కు ఇచ్చారు.. సంబంధిత ఇండెంట్ కాపీలు చూపించాలని రెవెన్యూ అధికారులు ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) నారాయణస్వామిని కోరారు. దీంతో డీఎం ఆగ్రహంతో ఊగిపోయారు. మా అనుమతి లేకుండా ట్యాంకర్‌ను ఎలా పట్టుకుంటారు? మీకేం అధికారాలు ఉన్నాయంటూ వాగ్వాదానికి దిగారు. ఒక మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌తో ఎలా మాట్లాడాలో తెలీదా అంటూ డీఎంపై తహసీల్దార్ మండిపడ్డారు. అడిగిన పత్రాలు ఇవ్వకుండా, పొంతనలేని సమాధానాలు ఇవ్వడం, రెవెన్యూ అధికారులను లోనికి వెళ్లకుండా చుట్టుముట్టడాన్ని సీరియస్‌గా పరిగణించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని నివేదిక రూపంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.

అధికారులకు బెదిరింపులు..

తమ ట్యాంకర్‌ను ఎలా పట్టుకుంటారంటూ డీజిల్ వ్యాపారులు రమణ, హరి అధికారులతో గొడవ పెట్టుకున్నారు. ఆర్టీసీ డిపోలోకి వచ్చి ట్యాంకర్‌ను అడ్డుకునే అధికారం మీకెక్కడిది అంటూ రెచ్చిపోయారు. తాము టీడీపీకి చెందిన వాళ్లం కాబట్టి అధికారులు వేధింపులకు దిగుతున్నారని విరుచుకుపడ్డారు. సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి తరచూ తమ ట్యాంకర్‌ను పట్టుకుంటున్నారని, డబ్బు కోసం ఆమె ఇలా చేస్తున్నారని ఆరోపణ చేశారు. అయితే సీఎస్‌డీటీ ఈ ఆరోపణలను కొట్టిపడేశారు. తాను నిక్కచ్చిగా విధులు నిర్వర్తించినందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు.



డ్రైవర్ నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న గార్లదిన్నెలోని ఔట్‌లెట్ యజమాని సంతకాలతో కూడిన ఖాళీ లెటర్ హెడ్, బిల్లు

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



రామిరెడ్డి (ఫైల్)

ముదిగుబ్బ: విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొడవళ్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ హేమంత్ కుమార్ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రైతు రామిరెడ్డి (64) తన ఐదెకరాల్లో వేరుశనగ, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. మోటార్ ఆన్ చేసే సమయంలో విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. అర్ధరాత్రి అయినా భర్త తిరిగి రాకపోవడంతో భార్య సావిత్రమ్మ కుమార్తె స్వాతితో కలిసి పొలానికి వెళ్లారు. రామిరెడ్డి విగత జీవిగా పడి ఉండడం గుర్తించి కన్నీరుమున్నీరయ్యారు. పక్కనే ఉన్న గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. శనివారం ఉదయం మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి దుర్మరణం

తనకల్లు: మండల పరిధిలోని చీకటిమానిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వెంకటరమణానాయక్ (45) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపిన మేరకు.. మండలంలోని మొగలిచెట్లతండాకు చెందిన వెంకటరమణానాయక్ అలియాస్ బాబునాయక్ తన ద్విచక్ర వాహనంలో చీకటిమానిపల్లి వైపు నుంచి కొక్కంటి క్రాస్‌కు బయలుదేరాడు. గ్రామం దగ్గర ఉన్న ఎరువుల ఫ్యాక్టరీ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొంది. దీంతో వెంకటరమణానాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాయి సేవకు అంకితం



సత్యసాయి మహాసమాధి చెంత భక్తులు

ప్రశాంతి నిలయం: ప్రేమే మార్గం.. సేవే లక్ష్యం అన్న సత్యసాయి బోధనను ఆచరిస్తూ సాయిసేవకు అంకితమవుతామని సత్యసాయి సేవా సంస్థల మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాల అధ్యక్షుడు సోమసుందరం అన్నారు. పర్తియాత్రలో భాగంగా శనివారం 2 వేల మంది సత్యసాయి భక్తులు ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయికుల్వంత్ సభా మందిరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. సత్యసాయి మహాసమాధి చెంత సంగీత కచేరి నిర్వహించారు. సాయంత్రం 'నీవిచ్చినవి నీకే సమర్పణ' పేరుతో ఏర్పాటు చేసిన నాటిక ఆకట్టుకుంది. అంతకుముందు రెండు జిల్లాల సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు సోమసుందరం మాట్లాడుతూ 2018లో జిల్లాలో స్థాపించిన సేవా సమితి ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. కరోనా సమయంలో 55 రోజులు నిర్విరామంగా అన్నదానం చేశామన్నారు. బాలవికాస్, సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. సమితి ప్రారంభంలో 70 బాలవికాస్ కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం 125 కేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు. 5,600 అమృత కలశాలను అందజేశామన్నారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా రాతిదూలం పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ముదిగుబ్బ: మండల పరిధిలోని దామానుపల్లిలో శనివారం ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. గ్రామంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని నిర్వహించిన పోటీలను ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నంద్యాల జిల్లా పెదకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవ రెడ్డి ఎద్దులు 4,632 అడుగులు రాతి దూలం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా బాలయ్యగారి పల్లికి చెందిన నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి వృషభాలు ద్వితీయ, అనంతపురం జిల్లా గడ్డంవారిపల్లికి చెందిన సానే గోపాల్ ఎద్దులు తృతీయ, తాడిపత్రి టౌన్‌కు చెందిన చెందిన రమేష్ యాదవ్ ఎద్దులు నాలుగు, ధర్మవరం టౌన్‌కు చెందిన ప్రణీత్ కుమార్ ఎద్దులు ఐదు, చిలమకూరు గ్రామానికి చెందిన చెందిన యతీష్ భాస్కర్ ఎద్దులు ఆరో స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండు– రూ.40 వేలు, మూడు– రూ.30 వేలు, నాలుగు– రూ.20 వేలు, ఐదు– రూ.10 వేలు, ఆరో బహుమతిగా రూ.5 వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరు నారాయణ రెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి, ఓబిరెడ్డి, కృష్ణారెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జిల్లాలో కదిరివాసి..

వేముల: మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామ సమీపంలో శనివారం టైరు పంక్చర్ కావడంతో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు... కదిరికి చెందిన బత్తా వెంకట రమణారెడ్డి (77) వివాహ సంబంధాలు చూస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో శనివారం పెనుగొండకు చెందిన నలుగురితోపాటు ఆయన ప్రొద్దుటూరుకు పెళ్లి చూపులకు కారులో బయలుదేరారు. నల్లచెరువుపల్లె వద్దకు రాగానే కారు టైరు పంక్చర్ కావడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా.. కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు బత్తా మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్‌కే వ్యాలీ ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రంగారావు తెలిపారు.

'బెస్ట్' అక్రమాలపై విద్యార్థుల భగ్గు



బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ సుబ్రమణ్యం

- కళాశాల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన

గోరంట్ల: 'ప్రభుత్వం ఇంకా యూజీసీ అనుమతులు ఇవ్వనే లేదు. ఐకార్ గుర్తింపూ లభించలేదు. కానీ నిబంధనలన్నీ తుంగలో తొక్కి విద్యార్థులతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు.' అంటూ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలో కమ్మలవాండ్లపల్లి సమీపంలోని బెస్ట్ యూనివర్సిటీ ఎదుట శనివారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీ యాజమాన్య నిర్లక్ష్య ధోరణి వల్లే రెండు రోజుల క్రితం నాల్గో సంవత్సరం విద్యార్థి మనోహర్ ఆత్మహత్యకు యత్నించాడన్నారు. మనోహర్ ఎంత ప్రాధేయపడినా కనికరించలేదని, పైగా సెక్యూరిటీ సిబ్బందితో బయటకు నెట్టేయించారని ఆరోపించారు. 120 రోజులకు నిర్వహించాల్సిన సెమిస్టర్ కాలపరిమితిని అక్రమంగా 90 రోజులకు కుదించారన్నారు. యూనివర్సిటీలో బోధన సరిగా ఉండడం లేదన్నారు. మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. అడ్మిషన్ల సమయంలో నాలుగు సంవత్సరాల అగ్రికల్చర్ కోర్సుకు హాస్టల్ వసతితో కలిపి విద్యార్థికి నాలుగు లక్షల ప్యాకేజీ అని చెప్పి, ఆ తర్వాత రూ. 8 లక్షలు వసూలు చేస్తున్నారన్నారు. సెమిస్టర్ ఫీజు చెల్లించకపోతే ఇష్టారాజ్యంగా పెనాల్టీలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనోహర్‌ను పరీక్ష రాయకుండా అడ్డుకున్న యూనివర్సిటీ సిబ్బందిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే దాకా సెమిస్టర్‌ను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల వద్దకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ సుబ్రమణ్యం చేరుకొని మాట్లాడారు. యాజమాన్యంతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీఐ సుబ్బరాయుడు నచ్చజెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు నోడల్ వ్యవస్థ ఏర్పాటు

- 27 మందికి 22 పనుల బాధ్యత అప్పగింత
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ నియోజకవర్గంతో పాటు స్థానిక సంస్థల నియోజక వర్గ ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎన్నికల ప్రక్రియలో చేపట్టాల్సిన 22 పనులను గుర్తించడంతో పాటు ఆయా పనుల నిర్వహణకు 27 మంది నోడల్ అధికారులను నియమించి బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి ఎస్. నాగలక్ష్మి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నోడల్ అధికారులు వీరే..

పేరు	హోదా	బాధ్యతలు
ఫకీరప్ప కాగినెల్లి	ఎస్పీ	లా అండ్ ఆర్డర్, ఈవీఎం అండ్ సెక్యూరిటీ ప్లాన్
కె.విజయలక్ష్మి	ఏఓ, కలెక్టరేట్	మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్
సరళ విజయకుమారి	డీడీ, ఖజానా శాఖ	
రవికుమార్	డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్	
కె.ఎల్.ప్రభాకరరావు	జిల్లా పంచాయతీ అధికారి	బ్యాలెట్ పేపర్ మేనేజ్‌మెంట్
జి.శ్రీనివాసులు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్	
ఎస్.శివరామప్రసాద్	డిప్యూటీ కమిషనర్, ట్రాన్స్‌పోర్ట్	ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్
ఐ.నరసింహారెడ్డి	పీడీ, డీఆర్‌డీఏ	ట్రైనింగ్ మేనేజ్‌మెంట్
విజయలక్ష్మి	పీడీ, మెప్మా	మెటీరియల్ మేనేజ్‌మెంట్
రవికుమార్	డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్	కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ
పి.కేశవనాయుడు	సీఈఓ, ఆన్‌సెట్	ఎస్‌వీఈఈపీ కార్యకలాపాలు
సి.హెచ్.ప్రేమ్‌చంద్	సీపీఓ	బ్యాలెట్ బాక్స్ ప్రొక్యూర్మెంట్
ఎస్.వెంకటేశ్వర్లు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్	మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్
ఎం.ప్రభాకర్‌రెడ్డి	జిల్లా కో–ఆపరేటివ్ అధికారి	ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్
రమేష్	డీపీఆర్ఓ, ఐఅండ్‌పీఆర్	ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా
తిప్పేస్వామి	డీడీ, భూగర్భజలశాఖ	కమ్యూనికేషన్ ప్లాన్
ఖుష్బూ కొఠారి	డీడీ, బీసీ వెల్ఫేర్	ఎలక్టోరల్ రోల్స్
సి.హెచ్.ప్రేమ్‌చంద్	సీపీఓ	ఫిర్యాదులు, పరిష్కారం ఓటర్ హెల్ప్‌లైన్
శంకరరావు	ఈఈ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు	పనుల తీరు పరిశీలన
భాగ్యరాజ్	ఎస్ఈ, పంచాయతీరాజ్	స్ట్రాంగ్‌రూమ్ అండ్ కౌంటింగ్ సెంటర్స్
జి.శంకరయ్య	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్	కౌంటింగ్ అరేంజ్‌మెంట్స్
జి.నాగేశ్వరరెడ్డి	టూరిజం అధికారి	
ఎస్.వెంకటరాముడు	డీఎం, ఏపీఎస్‌సీఎస్‌సీ	రిఫ్రెష్‌మెంట్ ఏర్పాట్లు
శోభారాణి	డీఎస్ఓ	
జి.నాగరాజారావు	జిల్లా పరిశ్రమల అధికారి	మైక్రో అబ్జర్వర్స్ (సూక్ష్మ పరిశీలకులు)
ఎస్.వేణుగోపాలరెడ్డి	పీడీ, డ్వామా	వెబ్‌కాస్టింగ్, ప్రొవిజన్ ఆఫ్ ఇంటర్నెట్
ఎస్.మహమ్మద్‌రఫీ	జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి	రిజర్వ్
ప్రభాకరరావు	ఈడీ, ఎస్సీ కార్పొరేషన్	
ఎం.అన్నాదొర	గిరిజన సంక్షేమ అధికారి	